క్లుప్తంగా

అపహరణకు గురైన సెల్‌ఫోన్ అందజేత


సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్‌ఐ బాలునాయక్

సూర్యాపేట రూరల్ : సెల్‌ఫోన్ అపహరణకు గురైందని జాటోతుతండాకు చెందిన నాగునాయక్ ఇటీవల పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఫోన్‌ను గుర్తించారు. ఎస్ బాలునాయక్ సోమవారం బాధితుడు నాగు నాయక్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిచి అతడికి ఫోన్‌ను అప్పగించారు. ఆయన వెంట సిబ్బంది ఉమామహేశ్వర్, బాబు, రమేష్, రవి, అస్గర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

తిరుమలగిరి : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. తాటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మాశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాజీవ్, లింగయ్య, సంతోష్, బాలకిషన్, సీత, స్వప్న పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

తిరుమలగిరి : ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్‌రావు తెలిపారు. తుంగతుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు సోమవారం తిరుమలగిరి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు జె.దయాకర్, పి.నాగేశ్వరరావు, పి.భిక్షం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, రిటైర్డ్ లెక్చరర్ల సంఘం నాయకులు బాబురావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.నరేష్, మూల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు..

తిరుమలగిరి : ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిషత్ వెలిశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.అశోక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు 14 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్‌లో చేరేందుకు పదవ తరగతి పాస్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 10వ తేదీలోపు అప్లై చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పాఠశాలలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ సీహెచ్.రవీందర్ ఫోన్ నంబర్ 9705233525ను సంప్రదించాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

చిలుకూరు : చిలుకూరు మండలంలోని జానకీనగర్ గ్రామ మాజీ సర్పంచ్ బాణోతు పంతులు నాయక్(85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత సర్పంచ్ ఎన్నికల్లో పంతులునాయక్ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రహదారుల నిర్వహణపై నిర్లక్ష్యం

- రోడ్లను కమ్మేస్తున్న ముళ్లపొదలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


అనాజిపురం సమీపంలో ప్రధాన రహదారిపై వాలిన కంపచెట్లు


పొట్లపహాడ్ సమీపంలో రోడ్డును ఆక్రమించిన ముళ్ల కంప

పెన్‌పహాడ్ : ప్రధాన రహదారులు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ముసురు వర్షాలతో రోడ్లపై వర్షపు నీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. మండల పరిధిలోని సూర్యాపేట–మిర్యాలగూడ ప్రధాన రహదారితోపాటు మండలంలోని మాచారం – పొట్లపహాడ్, అనంతారం –అనాజిపురం, చీదెళ్ల – చెట్లముకుందాపురం, చీదెళ్ల – తంగెళ్లగూడెం తదితర రహదారులకు పలు చోట్ల మలుపుల వద్ద ముళ్ల పొదలు కమ్ముకోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టింపు కరువు..

ప్రతి ఏటా రోడ్ల నిర్వహణ చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రహదారులపై గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్ల వెంబడి ముళ్లపొదలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా వర్షాలకు ఇసుక మేటలు ఏర్పడి రహదారులు ప్రమాదభరితంగా మారుతున్నాయి. ముళ్లపొదలు రోడ్లకు అడ్డంగా పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల నిర్వహణ చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ముళ్లపొదలను తొలగించాలి

రోడ్డు పక్కన ముళ్లపొదలు పెరిగి రోడ్లపైకి వాలాయి. వాహనదారులకు మలుపుల వద్ద వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు కంపచెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలి.

– నర్సయ్య, అనాజిపురం

నిర్వహణ మరిచారు

ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్మాణం చేపట్టిన తరువాత వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రతి ఏటా ఆర్‌అండ్‌బీ అధికారులు గ్యాంగ్‌మెన్‌ల ద్వారా జంగల్‌కటింగ్, గుంతల పూడ్చివేత వంటి పనులు చేపట్టాలి.

– నాగయ్య పొట్లపహాడ్

పనులు చేపడతాం



ప్రధాన రహదారులపై పలుచోట్ల జంగల్ కటింగ్ చేపట్టాల్సి ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చెట్లు పెరిగి రోడ్లను ఆక్రమించాయి. రోడ్లపై ముళ్లపొదలు తొలగించేందుకు నిధుల మంజూరుతో టెండర్ వేశాం. త్వరలోనే పనులు చేపడతాం.

– యుగేందర్, ఆర్‌అండ్‌బీ, ఏఈ

పంటల సాగు వివరాలు నమోదు


అడివెంలలో పంటల వివరాలను నమోదు చేసుకుంటున్న ఏఈఓ సత్యం

అర్వపల్లి : రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా తమవద్ద నమోదు చేయించుకోవాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం కోరారు. అడివెంల గ్రామంలో సోమవారం క్షేత్రస్థాయికి వెళ్లి పొలాల్లో తిరుగుతూ రైతుల వారీగా పంటల వివరాలను తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంటలసాగు వివరాలు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరుగుతుందని చెప్పారు. అలాగే పంటల బీమా కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ సీఈఓ మేడబోయిన రామస్వామి, రైతులు బంటు యాదగిరి, పిట్టల సైదులు, ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు


కుక్కడం పాఠశాలలో సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చిన్ననెమిల, ముకుందాపురం, మామిండ్లమడవ, చందుపట్ల, పోలుమమల్ల, గోరెంట్ల, కుక్కడం, రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే సంఘం పీఆర్‌టీయూ టీఎస్ ఒక్కటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, మహేశ్వరం వెంకటయ్య, మేడిపల్లి శ్రీనివాస్, కందుకూరి శివ శంకర్, దయాకర్, విష్ణు కుమార్, కడారి సతీష్, నెమ్మాని కోటేశ్వర్‌రావు, శంకర్, రవీందర్, సయ్యద్ జహీర్, శంకర్‌నాయక్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంలకు చేరుకున్న పాదయాత్ర


చివ్వెంల : దురాజ్‌పల్లి వద్ద స్వాగతం పలుకుతున్న నాయకులు

చివ్వెంల : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య జరిగిన చోటు పెరంబుదూరు నుంచి చెన్నై కార్పొరేటర్ శామ్యూల్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రాజీవ్ జ్యోతి యాత్ర సోమవారం దురాజ్‌పల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారికి మండల నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధరావతు వీరన్న నాయక్, యల్క నర్సిరెడ్డి, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ అధికారి చరణ్

నూతనకల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎల్.చరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షా కాలంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని వృద్ధి చెందుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వస్తుందని తెలిపారు. కలుషిత నీరు, కలుషితమైన ఆహార పదార్థాలు, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడంతో వ్యాధులు సోకుతాయన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి, వెంకన్న, హెచ్ఏ వనిత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని ఎర్ర సూర్యాతండాలో సోమవారం రాత్రి తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గత తొమ్మిది రోజులుగా ఉపవాస్ దీక్షలతో ఉన్నారు. తమ ఆరాధ్య దైవం మేరియాడి, సంత్ సేవాలాల్ మహరాజ్ స్వామిని భక్తి శ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా పెళ్లికాని యువతులు వెదురు బుట్టలలో ఉంచిన నవధాన్యాల మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీ విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు ధరావతు బాలు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చుక్క నీరు లేదాయే.. సాగు భారమాయే

- వర్షాలు లేక అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వరిసాగుకు అదునుదాటుతుండడంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు


ఏపూరులో సాగుకు నోచుకోని భూమి


ఏపూరులో నీళ్లు లేక నెర్రెలు వారుతున్న భూమి

ఆత్మకూర్ (ఎస్) : వానాకాలం సీజన్ ప్రారంభమై 70 రోజులు దాటినా.. మండలంలో వరిసాగు ప్రశ్నార్థకంగా ఉంది. మండల వ్యాప్తంగా నేటి వరకు పెద్ద వర్షాలు కురవలేదు. అప్పుడప్పుడు మోస్తరు వర్షాలు వస్తుండగా.. నేటి వరకు మండలంలోని చెరువులు, కుంటల్లోకి చుక్కా నీరు చేరలేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు వట్టిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో వరి సాగు అంతంత మాత్రంగానే జరుగుతోంది. ఇప్పటి వరకు కేవలం 40 శాతం మేర వరినాట్లు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ యేడు వరి పంట సాగు 50 శాతానికి మించేలా లేదు. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా పత్తి, పెసర చేలు ఏపుగా పెరిగాయి. ఆయా పంటలను సాగు చేసిన రైతులు ఈ సంవత్సరం మంచి దిగుబడి వస్తుందని ఆనందపడుతున్నారు.

నాన్ ఆయకట్టు నుంచి.. వరి సాగు వైపు..!

ఆత్మకూరు మండలం మొదటి నుంచి నాన్ ఆయకట్టు ప్రాంతం. ఇక్కడ బోరుబావుల కింద వరి సాగయ్యేది. మిగతా నీటి వసతి లేని ప్రాంతాల్లో మెట్టపంటలైన పత్తితోపాటు పెసర, వేరుశనగ, కంది సాగయ్యేది. అయితే 2018 నుంచి ప్రభుత్వం ఎస్సారెస్పీ రెండోదశ కింద రెండు పంటలకు నీళ్లు ఇవ్వడంతో రైతులు పత్తి, ఇతర పంటలను సాగు చేయడం మానేశారు. భూములన్నింటినీ వరి సాగుకు అనుకూలంగా మార్చుకుని ఎస్సారెస్పీ నీటితో వరి సాగు చేస్తున్నారు. కాలువ నీళ్లతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరి నిండుకుండల్లా ఉండడంతో ఇక్కడ వరి సాగే జరిగింది. అయితే గతేడాది నుంచి వర్షాలు ముఖం చాటేశాయి. గత ఖరీఫ్ సీజన్‌లో ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో రైతులు వరి పంటను సాగు చేయగలిగారు. తదనంతరం యాసంగితోపాటు ప్రస్తుత వానాకాలం వరకు వరుణుడు కరుణించకపోవడంతో సాగు నీటికి కష్టాలు ఏర్పడ్డాయి. ఓవైపు చెరువులు, కుంటలు వట్టిపోగా.. కాలువ రాకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కనీసం చెరువులు, కుంటలను నింపేందుకైనా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తే బోరుబావుల కింద భూగర్భ జలాలు పెరిగి కొంతైనా సాగుకు ఉపయోగపడుతుందని రైతులు భావిస్తున్నారు. మరో 15 రోజుల వరకు కూడా మంచి వర్షాలు రాకుండా, కాలువ నీళ్లు లేని పరిస్థితులు ఉంటే ఈ సీజన్‌లో వరిసాగు కష్టమేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

చెరువులు నింపాలి



గత రబీ నుంచి భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు, కుంటల్లో నీళ్లు తగ్గి బోర్లు సరిపడా పోయడంలేదు. ఈ సారి కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. వరి సాగుకు సిద్ధమైన రైతులు అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం నీటిని విడుదల చేసి మండలంలోని చెరువులు నింపాలి.

– బత్తుల ప్రసాద్, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి

సాగు ప్రశ్నార్థకంగా ఉంది



వర్షాలు కురవక పోవడంతో నేటికీ చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. వరి సాగుకు సిద్ధమైన రైతులకు నీళ్లు లేకపోవడంతో నాట్లు పెట్టే పరిస్థితిలేదు. గోదావరి నీరు వృథాగా పోకుండా ఇక్కడి చెరువులు నింపాలి. చెరువులు నింపకపోయినా, మరో 15 రోజుల్లో వర్షాలు కురవకపోయినా ఈ సీజన్‌లో వరిసాగు చేస్తున్న రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుంది.

– దేగల వెంకటకృష్ణ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు

14న హుండీ లెక్కింపు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ హుండీని ఈ నెల 14న లెక్కించనున్నట్లు ఆలయ అధికారి కుశలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కానుకల ద్వారా సమర్పించిన డబ్బులు, ఇతర వస్తువులను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

మఠంపల్లి : మండల కేంద్రంతోపాటు కాల్వపల్లితండా గ్రామ పంచాయతీ కార్యాలయాల రికార్డులను సోమవారం ఎంపీడీఓ హరిసింగ్ తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణను కార్యదర్శులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఫాగింగ్, తదితర పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి విజయక్రాంతి, కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారావు, మండల పరిషత్ సిబ్బంది కోటిరెడ్డి, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ


చివ్వెంల : ఐలాపురంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు


ఆత్మకూర్ (ఎస్) : నసీంపేటలో సభ్యత్వం అందిస్తున్న సంఘం నాయకులు

చివ్వెంల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఎఫ్ ముందు ఉంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బండి పాపిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కుడకుడ, ఐలాపురం, కోమటికుంట, వట్టిఖమ్మంపహాడ్ గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలు చెల్లించి, పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు అనిల్ కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దురుసోజు శ్రీనివాస్‌చారి, ఎన్.సైదా, శంకర్, యాదయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.కరుణాకర్ రెడ్డి, చిలక రమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నసీంపేట, రామోజీ తండా, పుప్పాలగూడెం, ముక్కుడు దేవులపల్లి, పాతర్ల పహాడ్, ఏవీకే తండా, గట్టికల్ మోడల్ స్కూల్‌లలో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సన్నీల్లా అంజయ్య, మేక వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నాగారం : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం) డాక్టర్ స్పందన అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థుల ఎత్తు, బరువును పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ గౌతం, ఎంపీహెచ్ఏ కె.గీత, ఫార్మసిస్ట్ సతీష్, ప్రధానోపాధ్యాయులు రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు ఆర్. వీరేష్, బి.భాస్కర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


మురుగు కాలువ శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జాజిరెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆవాసం తుంగగూడెంలో సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. గ్రామపంచాయతీ కార్మికులతో మురుగు కాలువలు శుభ్రం చేయించడం, చెత్తాచెదారం తొలగించడం వంటి పనులు చేయించారు. ప్రజలు చెత్తను, వ్యర్థాలను వీధుల్లో పడవేయవద్దని, చెత్త ట్రాక్టర్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


ఆత్మకూరులో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తండు వెంకటనారాయణ మాట్లాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెంకన్న, గోవర్ధన్, మురళీ, వెంకటేశ్వర్లును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, ఇందిర, శోభరాణి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన వారిని సోమవారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెన్న ఊర్మిళ మాట్లాడారు. బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులు వి.నాగలక్ష్మి, బాణాల సంతోష్ కుమార్, బత్తుల ప్రభాకర్‌లను సన్మానించారు. ఉపాధ్యాయురాలు వనజ పాఠశాలకు మూడు బీరువాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు వనజ, జగన్, చౌధర్ రెడ్డి పాల్గొన్నారు.


మద్దిరాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

వీధిలైట్లు వెలగక అంధకారం

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిసే ప్రధాన కూడలి అయిన అర్వపల్లిలో కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగక ప్రజలు అంధకారంతో ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయం రోడ్డుతోపాటు పోలీస్ స్టేషన్, జనగామ రోడ్డు, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి తదితర రోడ్లలో లైట్లు పనిచేయడం లేదు. సాయంత్రమైతే వీధులు అంధకారంగా మారుతున్నాయి. ఓ పక్క కుక్కలు వీధుల్లో సంచరిస్తూ రాత్రి వేళల్లో కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. జంక్షన్ కావడంతో రోడ్లపై పెద్దసంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ చీకటితో రోడ్లపై ఏమి కనిపించక వాహన చోదకులు ఇక్కట్ల పాలవుతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్యను వివరణ కోరగా కొత్త లైట్లు తెప్పించామని అన్నారు. లైట్లను బిగించడానికి విద్యుత్ సిబ్బందితో మాట్లాడామని తెలిపారు. రెండు రోజుల్లో కొత్త లైట్లు వేయిస్తామని చెప్పారు.


వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారంగా మారిన అర్వపల్లిలోని కాసర్లపహాడ్‌కు వెళ్లే దారి


అర్వపల్లిలోని దేవాలయం రోడ్డులో..

పలువురికి ఆర్థికసాయం అందజేత

నూతనకల్: వెంకెపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ అందించిన రూ. 5వేలు, 50కేజీల బియ్యాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కుంట చంద్రారెడ్డి, పాల్వాయి నాగరాజు, సైదులు, బుచ్చిరెడ్డి, పరశురాములు, రవి, సాయిరెడ్డి, ఆదిరెడ్డి, కార్తీక్, వెంకన్న పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన జీడి మల్లేష్ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలిసిన గ్రామ పీఏసీఎస్ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇందుర్తి వెంకట్‌రెడ్డి స్పందించి సోమవారం అతడికి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం గ్రామ మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, వేములకొండ ఉప్పలయ్య, బొడ్డు వెంకటనర్సు, బొడ్డు రమేష్, రజాక్, ఈదునూరి సంతోష్, సీహెచ్. రమేష్, జీడి శ్రీకాంత్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ మృతి తీరని లోటు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి కట్టెకోల నారాయణ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కట్టెకోల నారాయణ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, మండల అధ్యక్షుడు కట్టెకోల నాగేశ్వరరావు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డా రమేష్, దొడ్డా నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.